సాక్షి
మెదక్
శుక్రవారం। 19। జనవరి। 2024



రేపే నవోదయ ప్రవేశ పరీక్ష

ఆరో తరగతిలో ప్రవేశం కోసం నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. వివరాలు 8లో ▸



కేజ్‌వీల్స్‌తో రోడ్లు ధ్వంసం

కేజ్‌వీల్స్ ట్రాక్టర్ల ప్రయాణిస్తుండటంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. వివరాలు 9లో ▸

20 నుంచి ప్రత్యేక ఓటరు నమోదు

నర్సాపూర్ రూరల్: నియోజకవర్గవ్యాప్తంగా ఈనెల 20, 21వ తేదీన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాసులు గురువారం తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, పాత వారికి చేర్పులు మార్పులు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

మోడల్ స్కూల్, కేజీబీవీకి నిధులు

మరమ్మతు పనులకు రూ.1.35 కోట్లు మంజూరు



మోడల్ స్కూల్ (ఫైల్)

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ (కేజీబీవీ) పాఠశాలలకు మోక్షం లభించింది. ఈ పాఠశాలల మరమ్మతుల కోసం మంత్రి దామోదర రాజనర్సింహ రూ. కోటి 35 లక్షల 50 వేలను మంజూరు చేసినట్లు ఏఈ మల్లప్ప గురువారం సాక్షికి తెలిపారు. మోడల్ స్కూల్‌లో మిగిలిన పనులకు రూ.72 లక్షల 50 వేలు, కేజీబీవీలో మరమ్మతుల కోసం రూ.63 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కాగా, గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిప్యూటీ సీఎంగా ఉన్న దామోదర రాజనర్సింహయే వాటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఆయన మంత్రి కావడం జరిగింది. మళ్లీ మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయడం పై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి దామోదరతోనే అభివృద్ధి సాధ్యమని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి, కోఆప్షన్ సభ్యుడు చోటుమియా, మాజీ ఎంపీటీసీ ఎం.నరేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

రైస్‌మిల్ వ్యాపారి శ్రీధర్ గుప్తా రిమాండ్

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్‌కు చెందిన రైస్‌మిల్ వ్యాపారి పైడి శ్రీధర్ గుప్తాను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శివకుమార్ గురువారం తెలిపారు. రూ. 47 కోట్ల విలువ చేసే సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) తిరిగి ఇవ్వనందున శ్రీపాద, వెంకటేశ్వర రైస్‌మిల్లుల యజమాని అయిన అతడిపై ప్రభుత్వం, సివిల్ సప్లయి కార్పొరేషన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అధిక ధరకు స్టాంప్ పేపర్ల విక్రయాలు



సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న వివిధ పార్టీల నాయకులు

హుస్నాబాద్: పట్టణంలో స్టాంప్ వెండర్లు నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు స్టాంప్ పేపర్లు అమ్ముతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలో ఉన్న స్టాంప్ వెండర్లు రూ.30 అధికంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై విచారణ జరిపి స్టాంప్ వెండర్ల పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అచ్చంపేట ఎంపీటీసీపై అనర్హత వేటు



మూడ్ సోనీ

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట్ మండలం అచ్చంపేట ఎంపీటీసీ పదవికి మూడ్ సోనీని అనర్హురాలిగా ప్రకటిస్తూ మెదక్ జెడ్పీ సీఈఓ శైలేష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్టీ రిజర్వేషన్ స్థానంలో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో గెలుపొందినట్లు గుర్తించి ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఆమె ఎన్నిక చెల్లదని ప్రకటించారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయన్నారు. ఆమె ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ అభ్యర్థి చవాన్ సోలి 2021లో హైకోర్టులో కేసు వేయడం విదితమే.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్: జిల్లా సైన్స్ అధికారి పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ సైన్స్ టీచర్, సైన్స్ నేపథ్యం ఉన్న హైస్కూల్ హెడ్ మాస్టర్, సైన్స్ మెథడాలజీలో కంటెంట్ పై మంచి పట్టు ఉండాలి. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్లలో పాల్గొన్న అనుభవం, ప్రాజెక్టులు తయారు చేయడం, సెమినార్లు నిర్వహించడంలో అనుభవం, కలిగిన ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అక్రమార్కుల డేగకన్ను

- 180 ఎకరాల అటవీ భూమి ఆక్రమణ
- ఇటీవల గాజిరెడ్డిపల్లి ప్రాంతాన్ని సైతం..



గాజిరెడ్డిపల్లి ఇటీవల నరికివేతకు గురైన అటవీ ప్రాంతం

అటవీ ప్రాంతంలోని చెట్లను నరికి ఆ ప్రాంతాన్ని కబ్జా చేస్తున్నారు. ఇందులో పంటలను సాగు చేస్తున్నారు అక్రమార్కులు. ఇప్పటివరకు అనేక కేసులు నమోదు చేసినా వారి తీరు మాత్రం మారడం లేదు. ఒక వైపు అటవీ ప్రాంతం పచ్చదనం కోల్పోయి కళావిహీనంగా కాన వస్తోంది.

మెదక్: జిల్లాలో 58 వేల హెక్టార్లలో అడవీ ప్రాంతం ఉంది. మెదక్, కౌడిపల్లి, రామయంపేట, నర్సాపూర్, పెద్దశంకరంపేట, తూప్రాన్ ఆరు రేంజ్‌లు ఉన్నాయి. పెద్దశంకరంపేట ఫారెస్ట్ రేంజ్‌లో 74.94 ఎకరాలు, మెదక్ రేంజ్ పరిధిలో 36.18 ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. ఈ ప్రాంత పరిధిలో గాజిరెడ్డిపల్లి, బూర్గుపల్లి, రాజ్‌పేట, కొత్తపల్లి, కప్రాయిపల్లి, శమ్నాపూర్, గంగాపూర్ అటవీ ప్రాంతాలుంటాయి. ఇక్కడ నిత్యం ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంటుంది. 2022 నుంచి 2023 వరకు 180 ఎకరాలను ఆక్రమించారు. సంబంధిత శాఖాధికారులు 557 మందిని ఆక్రమణదారులను గుర్తించి 109 కేసులు పెట్టారు. ఇటీవల మూడురోజుల క్రితం హవేళీఘనాపూర్ మండలం గాజిరెడ్డిపల్లి మెదక్- బోధన్ రోడ్డు ప్రధాన రహదారికి పక్కన గాజిరెడ్డి పల్లి గేటు అటవీ ప్రాంతంలో ఉన్న సుమారు 6 ఎకరాలలో ఉన్న చెట్లను నరికి ఆక్రమించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు అడవిని ఆక్రమించారని అధికారులు కేసులు పెడితే కొందరు నేతలు అడ్డుకున్నారని తెలిసింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో వారందరూ అరెస్టు అయ్యారు. కబ్జాల పర్వంపై కలెక్టర్‌కు దృష్టికి అధికార పార్టీ నేతలు తీసుకెళ్లారు. ఆయన స్పందించి ప్రభుత్వం తరపున అందుతున్న పథకాలు, సబ్సిడీలను ఎత్తి వేసేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేంజ్	కేసులు	ఎకరాలు	వ్యక్తుల సంఖ్య
మెదక్	53	36.18	220
రామాయంపేట	02	13.16	15
నర్సాపూర్	04	4.65	12
తూప్రాన్	07	16.76	69
పెద్దశంకరంపేట	18	74.94	163
కౌడిపల్లి	25	35.00	78
మొత్తం	109	180.69	557

35 కేసులు నమోదు చేశాం

హవేళీఘనాపూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 25 మంది గతంలో అడవులను ఆక్రమిస్తే కేసులు నమోదు చేశాం. 3 రోజుల క్రితం మరో 8 మందిపై కూడా ఇదే తరహా కేసులు పెట్టాం. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను. వీరందరిపై త్వరలోనే చర్యలు తీసుకుంటాం. వీరిలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన కార్యకర్తలు, మద్దతుదారులు ఉన్నారు.

– మనోజ్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, మెదక్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

27 లక్షల మొక్కలు నాటాలి

- ఈ ఏడాది హరితహారం లక్ష్యం ఇదే
- కలెక్టర్ రాజర్షిషా స్పష్టీకరణ

మెదక్ కలెక్టరేట్: హరితహారం లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు అధికారులు ప్రణాళికబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో హరితహారం కార్యక్రమం, గ్రామాల అభివృద్ధి, ఓటరు నమోదు తదితర అంశాలపై సంబంధిత శాఖాధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది 27 లక్షలు, 2025లో 25 లక్షలు, 2026లో మరో 25 లక్షల మొక్కలు నాటేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అధికారులు నాటిన ప్రతి మొక్క జీవించేలా చూడాలని సూచించారు. ఔషధ మొక్కలు, నీడ నిచ్చే మొక్కలు, పూల మొక్కలు, రహదారుల వెంట పెద్ద మొక్కలు నాటాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో కోతుల బెడద ఎక్కువైందని, బయట సంచరించకుండా అడవి లోపలే పండ్ల మొక్కలు నాటాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల మొక్కలు, పశువుల గడ్డి కోసం ప్లాంటేషన్, ఆయిల్ పాం సాగు చేసేందుకు రైతులను ప్రోత్సాహించాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో నీటి పారుదల కింద బండ్ ప్లాంటేషన్, అటవీ శాఖ పరిధిలో బ్లాక్ ప్లాంటేషన్, అంగన్వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లతోపాటు మునగ చెట్లు నాటించాలని తెలిపారు. మార్కెట్ యార్డు, క్వారీలు, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, ఆర్డీఓ తదితర అన్ని కార్యాలయాల వద్ద పద్ధతి ప్రకారం మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

గ్రామాల అభివృద్ధికి సంబంధిత అధికారులు ప్రణాళికలను త్వరితగతిన రూపొందించుకొని ఈనెల 31 లోగా గ్రామ్ స్వరాజ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని రాజర్షిషా అన్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసి తద్వారా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గ్రామం, మండలం, జిల్లా స్థాయిలో ఈనెల 27 లోపు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు.

ఓటరు నమోదుకు చివరి అవకాశం

జిల్లాలో ఓటరు నమోదుకు ఇదే చివరి అవకాశమని, ఈనెల 20, 21వ తేదీల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాజర్షిషా తెలిపారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున చాటింపు వేయాలని అధికారులకు సూచించారు. కేంద్రాల్లో ఫామ్ 6,7,8లు కూడా అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయంలో కూడా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్ రమేష్, జెడ్పీ సీఈఓ శైలేష్, డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి రవిప్రసాద్, డీపీఓ సాయిబాబా, ఎంపీడీఓలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఈపాస్ ద్వారానే ఎరువుల విక్రయాలు

జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న గోవిందు

రామాయంపేట(మెదక్): ఫర్టిలైజర్ దుకాణాల్లో ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు జరపాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు అన్నారు. గురువారం రామాయంపేటలో పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎరువులు కొనుగోలు చేసే రైతులు ఆధార్ వివరాలను దుకాణదారులకు అందజేయాలన్నారు. వారు విధిగా రికార్డులు నిర్వహించాలన్నారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట రామాయంపేట, నిజాంపేట మండల వ్యవసాయ అధికారులు రాజ్‌నారాయణ, సతీష్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి మహేశ్‌గౌడ్‌కు సన్మానం



మహేశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న రామచందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్‌ను సన్మానించారు. గురువారం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచందర్‌గౌడ్ సత్కరించారు. పార్టీ నాయకులు తాళ్ల పండరిగౌడ్, తొనిగండ్ల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

సంగారెడ్డి టౌన్: ఈనెల 20న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన గురువారం ప్రకటనలో తెలిపారు. ఎస్బీఐ లైఫ్ కంపెనీలో 160 ఉద్యోగాల భర్తీకి ఉదయం 11 నుంచి 2 గంటల వరకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని జిల్లా ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు, ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 08455-271010 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఖైదీల సమస్యలపై చర్చ



సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ బాలస్వామి తదితరులు

మెదక్ కలెక్టరేట్: జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ రాజర్షిషా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలోని జైళ్లల్లో ఉన్న ఖైదీల సమస్యలపై ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఆ ప్రాంతానికి సంబంధించిన విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్పీ బాలస్వామి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, ఇతర అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వీగుతుందా.. నెగ్గుతుందా..

నేడు చేర్యాల మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లపై అవిశ్వాసం



జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని ఇటీవల కలిసిన కౌన్సిలర్లు

సాక్షి, సిద్దిపేట/ చేర్యాల: చేర్యాల మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్‌లపై అవిశ్వాసం వీగుతుందా?.. నెగ్గుతుందా? అనే విషయంపై జిల్లా వ్యాప్తంగా చర్చ జోరుగా జరుగుతోంది. పురపాలక సంఘం ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టాలని డిసెంబర్ 21న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు తొమ్మిది మంది కౌన్సిలర్లు తీర్మాన కాపీని అందజేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నారు.

ఇండిపెండెంట్లే కీలకం

ఈ మున్సిపాలిటీ ఎన్నికలు జనవరి, 2020లో జరగగా ఐదుగురు బీఆర్ఎస్, ఐదుగురు కాంగ్రెస్, ఇద్దరు ఇండిపెండెంట్లు గెలుపొందారు. ప్రస్తుతం ఆ ఇద్దరు ఇండిపెండెంట్లు కీలకమయ్యారు. వారి మద్దతుతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన స్వరూప శ్రీధర్‌రెడ్డి ఛైర్‌పర్సన్, ఒక ఇండిపెండెంట్ నిమ్మ రాజీవ్ రెడ్డి వైస్ ఛైర్మన్ అయ్యారు. మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నేతృత్వంలో ఇండిపెండెంట్‌గా గెలుపొందిన 7వ వార్డు కౌన్సిలర్ జుబేదా బీఆర్ఎస్‌లో గతంలోనే చేరారు. పలువురు కౌన్సిలర్లు కలిసి 2023 జనవరిలో అవిశ్వాసం పెట్టాలని పట్టుబట్టారు. ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్‌లతో మాట్లాడి అప్పటి ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి గొడవను సద్దుమణిగించారు. మరోమారు డిసెంబర్ 21న పాలకవర్గం అవిశ్వాసగలమెత్తారు. దీంతో అదనపు కలెక్టర్‌కు తీర్మాన కాపీని అందించారు.

రంగంలోకి పల్లా..

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి రంగంలోకి దిగి అవిశ్వాసం వీగే విధంగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు హైదరాబాద్‌లో మకాం వేశారు. తమ పార్టీకి చెందిన కౌన్సిలర్ల మధ్య ఎమ్మెల్యే సయోధ్యను కుదిర్చినట్లు తెలిసింది. దీంతో ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

అవిశ్వాసం నెగ్గితే..

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు ఉండగా అందరూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఛైర్‌పర్సన్లుగా ఉన్నారు. చేర్యాల మున్సిపాలిటీ అవిశ్వాసం నెగ్గితే మిగతా మున్సిపాలిటీలపై ప్రభావం పడుతుందని బీఆర్ఎస్ అప్రమత్తమైంది.

యాసంగికి నీరు విడుదల

- మూడు రోజుల పాటు నీటి పంపింగ్
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



రంగనాయక సాగర్‌లోకి విడుదల చేస్తున్న నీరు

చిన్నకోడూరు(సిద్దిపేట): యాసంగి పంటల కోసం రంగనాయక సాగర్‌లోకి నీరు విడుదల చేస్తున్నారు. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పంటలకు నీళ్లు లేక ఆందోళన చెందుతున్న వారిని ఆదుకోవడానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇటీవల ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాసిన విషయం విదితమే. అలాగే ఈ ప్రాంత రైతులు రంగనాయక సాగర్‌లోకి నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను 18, 19, 20 తేదీలలో రంగనాయక సాగర్‌లోకి ఒక టీఎంసీ నీటిని నింపాలని అధికారులను ఆదేశించారు. బుధ వారం ఇరిగేషన్ అధికారులు అనతంగిరి రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్‌లోకి నీటిని పంపింగ్ చేయడం ప్రారంభించారు. హరీశ్‌రావు కృషి ఫలితంగానే రంగనాయక సాగర్‌లోని నీటిని పంపింగ్ చేస్తున్నట్లు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



జొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): యాసంగి పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ కె.నూతన్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని ఫత్తేపూర్ శివారులో ఉన్న వరి, జొన్న పంటలను అయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మొవ్వు తొలిచే పురుగు, కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉందని, క్వీనాల్‌ఫాస్ రెండు మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కత్తెర పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజెట్ 0.4 గ్రామ్ ఒక లీటర్‌తో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పంటల వివరాలు నమోదు తప్పక చేయించుకోవాలని సూచించారు. ఏఈఓ సతీష్, రైతులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- పోలీసుల అదుపులో ఏడుగురు
- పరారీలో నలుగురు
- సెల్‌టవర్ల వద్ద మెటీరియల్ తస్కరణ
- బంగ్లాదేశ్‌లో బేస్‌బ్యాండ్ల విక్రయం
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ బాలస్వామి



నిందితుల అరెస్టును చూపుతున్న ఎస్పీ బాలస్వామి

మెదక్ మున్సిపాలిటీ: సెల్‌టవర్ వద్ద మెటీరియల్ చోరీ చేసి బంగ్లాదేశ్‌కు దొంగచాటుగా సామగ్రిని అమ్ముతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ బాలస్వామి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలను వెల్లడించారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలలో 11 మంది కలిసి అంతర్ జిల్లా దొంగల ముఠాగా ఏర్పడ్డారు. గతేడాది సెప్టెంబర్ చివరివారంలో రామంతాపూర్ గ్రామ శివారులోని సెల్‌టవర్ల వద్ద మెటీరియల్ చోరీ చేశారు. ఇదే తరహాలో జిల్లాలోని సెల్‌టవర్ల వద్ద ఉన్న బేస్‌బ్యాండ్లను సైతం చోరీ చేశారు. ఈ కేసును పోలీసుల చాలెంజ్‌గా తీసుకున్నారు. అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటైంది. దర్యాప్తులో భాగంగా చేగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీ చేస్తుండగా ఏడుగురు నిందితులు మహేష్, కైదాపూర్ సంతోష్‌రెడ్డి, గోవ్వూరి రత్నాకర్ రెడ్డి, కర్రోళ్ల రాజాగౌడ్, మైసని అనిల్, మహమ్మద్ ఆఫ్రోజ్ పాషా, పగిడిపల్లి అశోక్‌ను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 6.75 లక్షల రూపాయలు, 3 కారులు, బైక్, 7 మొబైల్స్, 7 రిసీవర్లు, 5 ఎయిర్‌టెల్ బేస్‌బ్యాండ్ యూనిట్లు స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు నిందితులు మైసని బాగులు, మైసని శేఖర్, మహమ్మద్ అబ్బు, చాంద్ పరారీలో ఉన్నారు. వారందరిపై 24 పోలీస్ స్టేషన్లలో 26 కేసున్నాయి. మొత్తం కేసుల్లో రూ. 25 లక్షలు విలువ గల మెటీరియల్ చోరీ చేశారని ఎస్పీ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బేస్‌బ్యాండ్ యూనిట్

ఈ కేసు చేధించిన రామాయంపేట సీఐ లక్ష్మీబాబు, ఇతర సిబ్బందిని అభినందించి, రివార్డులు అందజేశారు.

క్లుప్తంగా

గీతం అధ్యాపకుడికి డాక్టరేట్



బుర్ర భాస్కర్

పటాన్‌చెరు టౌన్: 'నాన్–సర్క్యులర్ జర్నల్ బేరింగ్ పనితీరుపై ఉపరితల ఆకృతి ప్రభావం' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన గీతం విశ్వవిద్యాలయం లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బుర్ర భాస్కర్‌ను డాక్టరేట్ వరించింది. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీతారామయ్య, ఉస్మానియా విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రమేశ్ బాబు ఈ పరిశోధనను పర్యవేక్షించినట్లు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. భాస్కర్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్ పట్టా సాధించడంపై గీతం విశ్వవిద్యాలయం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పీ.శ్రీనివాస్, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించారు.

అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

సెల్ టవర్ ఎక్కి నేతల నిరసన



సెల్ టవర్‌పై నేతలు

మెదక్: కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు నాయకులు బత్తుల ప్రసాద్, వెంకట్ గురువారం పట్టణంలోని జీకేఆర్ గార్డెన్ వద్ద సెల్ టవర్ ఎక్కారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని కిందికి దిగాలని కోరినా ఫలితం లేకపోవడంతో రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నిరసనకారులతో ఫోన్‌లో మాట్లాడి నచ్చజెప్పారు. అనంతరం కిందకి దిగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బ్యాంకు రివార్డు పాయింట్స్ పేరుతో మోసం

రూ.40,365 పోగొట్టుకున్న బాధితుడు

సిద్దిపేటకమాన్: సైబర్ మోసానికి గురై ఓ బాధితుడు డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సీపీ అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి బ్యాంకు రివార్డు పాయింట్స్ పేరుతో సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. మెసేజ్‌లో ఉన్న లింకును ఓపెన్ చేసి డెబిట్ కార్డు వివరాలు, ఓటీపీ వివరాలు నమోదు చేయగానే ఖాతా నుంచి రూ.40,365 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు గురువారం జాతీయ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు.


అదృశ్యమై.. అంతలోనే శవమై



శ్యామల (ఫైల్)

ములుగు(గజ్వేల్): ఇంటి నుంచి అదృశ్యమైన మహిళ చెట్టుకు ఉరి వేసుకొని శవమై కనిపించింది. ఈ ఘటన ములుగు మండలం నాగిరెడ్డిపల్లి శివారులో గురువారం వెలుగు చూసింది. ములుగు ఏఎస్ఐ ప్రేమ్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం .. అచ్చాయిపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నక్కిర్తి వెంకటేశ్ భార్య శ్యామల(40) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనెల 17న ఇంట్లో నిద్రపోయిన శ్యామల ఉదయం 7 గంటల ప్రాంతంలో భర్త లేచి చూడగా కనిపించలేదు. చుట్టు పక్కలా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు కింద నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా శ్యామల గురువారం నాగిరెడ్డిపల్లి శివారులో చెట్టుకు ఉరివేసుకొని శవమై కనిపించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లిదండ్రులు మాత్రం భర్త వెంకటేశ్, అతడి కుటుంబ సభ్యులపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అట్టహాసంగా జర్నలిస్టుల క్రికెట్ టోర్నీ



ఇరు జట్ల మధ్య టాస్ వేస్తున్న ప్రతినిధులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట నియోజకవర్గ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టుల ఆటవిడుపు గురువారం అందరినీ అలరించింది. స్థానిక స్టేడియంలో అట్టహాసంగా క్రికెట్ టోర్నీ జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా జట్లు ప్రత్యర్థులతో తలబడ్డాయి. లెవన్ టైగర్స్, విజే కింగ్స్ జట్లు ఫైనల్ కు చేరుకున్నాయి. నిర్ణీత 10 ఓవర్ల ప్రామాణికంగా మ్యాచ్ లు నిర్వహించారు. మొత్తం ఏడు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రంగాచారి, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

రేపే నవోదయ ప్రవేశ పరీక్ష

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 29 కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 5,796 మంది విద్యార్థులు
- సందేహాల నివృత్తికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్
- పకడ్బందీగా ఏర్పాట్లు



వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఇందులో ఉత్తీర్ణులైన వారికి 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశం కల్పించనున్నారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన విద్యాశాఖ అధికారులు, వర్గల్ నవోదయ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. మూడు జిల్లాల్లో పరీక్ష నిర్వహణకు సంబంధించి సెంటర్ లెవెల్ అబ్జర్వర్లు, సెంటర్ సూపరింటెండెంట్‌లకు ఓరియంటేషన్ కార్యక్రమం సైతం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు, అభ్యర్థులకు అనుమానాలు నివృత్తి చేసేందుకు 'హెల్ప్‌డెస్క్' ఏర్పాటు చేశారు.

- నవోదయ ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 5,796 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందుకుగాను వివిధ ప్రాంతాల్లో 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- సిద్దిపేట జిల్లాలో 2,182 మంది విద్యార్థులకు 10 పరీక్ష కేంద్రాలు, మెదక్ జిల్లాలో 1,501 విద్యార్థుల కోసం 7, సంగారెడ్డి జిల్లాలో 2,113 మందికి 12 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా సజావుగా పరీక్ష నిర్వహించేందుకు ప్రతీ కేంద్రంలో ఒక సెంటర్ సూపరింటెండెంట్, ఒక సెంటర్ లెవల్ అబ్జర్వర్‌ను నియమించారు.
- 24 మంది విద్యార్థులకు ఒక గది, ఒక ఇన్విజిలేటర్ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కేంద్రాలపై పర్యవేక్షణ బాధ్యతను మండల విద్యాధికారులకు అప్పగించారు.
- ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు జిల్లా ప్రధాన కేంద్రాల్లో శిక్షణ సైతం పూర్తి చేశారు.

గంట ముందే చేరుకోవాలి

- శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది.
- పరీక్ష నిర్వహణకు గంట ముందే విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాలి. దీంతో పరీక్ష ఆతృత, ఒత్తిడి ఉండదు.
- విద్యార్థులు తమ వెంట హాల్‌టికెట్ (అడ్మిట్‌కార్డు), రైటింగ్ ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్‌పై తీసుకొని రావాలి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుంది.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

సిద్దిపేటకమాన్: జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష జరగనున్న కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీ అనురాధ తెలిపారు. 20వ తేదీన జిల్లాలోని 12 కేంద్రాల వద్ద ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు. ఈ సమయంలో పరీక్షా కేంద్రాలకు 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడి ఉండొద్దన్నారు. సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. పరీక్ష సమయంలో పోలీసు అధికారులు పెట్రోలింగ్ నిర్వహించాలని, కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

మూడు భాగాలుగా పరీక్ష



నవోదయ ప్రవేశ పరీక్ష మూడు భాగాలుగా ఉంటుంది. ప్రతీ విభాగంలో ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలే ఉంటాయి. 100 మార్కులకు 80 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో సమాధానానికి 1.25 మార్కులు. మేథాశక్తి ప్రశ్నలు 40, గణిత ప్రశ్నలు 20, భాషా పరీక్ష ప్రశ్నలు 20 కలిపి మొత్తం 80 ప్రశ్నలు ఉంటాయి. సమాధానాలను ఓఎమ్ఆర్ షీట్‌లో ప్రశ్నకు సంబంధించిన జవాబుకు ఇవ్వబడిన నాలుగు వృత్తాల్లో సరైన వృత్తాన్ని లోపల ఖాళీ వదలకుండా, గీత దాటకుండా నిండుగా పెన్నుతో 'బబ్లింగ్' చేయాలి. వృత్తంలో ఖాళీ వదలినా, కొట్టివేతలు ఉన్నా వాటికి మార్కులు స్కోరు కావు.

– రాజేందర్ (నవోదయ ప్రిన్సిపాల్)

సమాచార హెల్ప్‌డెస్క్ :

డీ.రాజేందర్ (నవోదయ ప్రిన్సిపాల్): 99215 55310

ఏ.సురేందర్ (జెఎన్‌వీఎస్‌టీ ఇన్‌చార్జి): 79899 92919/ 94409 26144









రామ మందిర నమూనాతో రామరాజు

మనసంతా రామం భజే

నారాయణఖేడ్: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ ఈనెల 22న అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్ మండలం అనంతసాగర్‌కు చెందిన పత్ర చిత్రకారుడు గుండు శివ కుమార్ రావి, బాదం, మర్రి ఆకులపై శ్రీరాముడి వివిధ దివ్యమంగళ స్వరూపాలను మలచి ప్రాణప్రతిష్ఠ శుభాకాంక్షలు తెలిపారు.

బిస్కెట్లతో రామ మందిరం నమూనా

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామరాజు బిస్కెట్లతో రామమందిర నమూనాను రూపొందించి భక్తిని చాటుకున్నాడు. గురువారం పట్టణంలోని రామకోటి కార్యాలయంలో సుమారు వెయ్యికి పైగా వివిధ రకాల బిస్కెట్లను ఉపయోగించి అయోధ్యలో నిర్మితమవుతున్న రామమందిర దేవాలయ నమూనాను రూపొందించాడు.

అట్ట ముక్కలతో..

కౌడిపల్లి(నర్సాపూర్): అట్టముక్కలతో అయోధ్య శ్రీరామ మందిరం తయారు చేసి ఔరా అనిపించాడు కౌడిపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు రవి. అయోధ్యలో రామమందిరం నిర్మాణం అవుతుండడంతో సంతోషం వ్యక్తం చేస్తూ అట్టముక్కలతో రెండు రోజులు కష్టపడి ఆలయాన్ని తయారు చేసినట్లు చెప్పారు.



అట్టముక్కలతో రామ మందిరం

సంక్రాంతి పండుగకు వెళ్లొచ్చేసరికి..

- తాళం వేసిన రెండు ఇళ్లల్లో చోరీ
- 14 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

పటాన్‌చెరుటౌన్: తాళం వేసిన రెండు వేర్వేరు ఇళ్లల్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం .. బంధం కొమ్ములో నివాసం ఉండే వెంకట్‌రావు సంక్రాంతి పండుగ కోసం ఇంటికి తాళం వేసి ఈ నెల 13న సికింద్రాబాద్‌కు వెళ్లాడు. తిరిగి బుధవారం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలోని 12 తులాల బంగారు చోరీకి గురైనట్లు గుర్తించి, గురువారం వెంకట్‌రావు అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనకు సంబంధించి అమీన్‌పూర్ మండలంలోని పటేల్‌గూడా బీహెచ్ఈఎల్ మెట్రో కాలనీలో ఉండే మురారీ ఈ నెల 13వ తేదీన సంక్రాంతి పండుగ కోసం సొంతూరు పుల్కల్ మండలం గొంగులూరుకు వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని రెండున్నర తులాల బంగారం కనిపించ లేదు. ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారని వెంటనే అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నప్పడే అమ్మనాన్న.. ఇప్పుడు నానమ్మ

- చనిపోవడంతో అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలు
- అంతాయిగూడ గ్రామంలో విషాదకరం



పవన్, కార్తీక్

జగదేవ్‌పూర్(గజ్వేల్): చిన్నతనంలో అమ్మనాన్న మృతి చెందడంతో ఆ చిన్నారులకు నానమ్మే దిక్కు అయింది. పిల్లలను పెంచి పెద్ద చేసింది. చివరకు నానమ్మ కూడా మృతి చెందడంతో ఇద్దరూ అనాథలుగా మారారు. వివరాల్లోకి వెళ్తే.. జగదేవ్‌పూర్ మండలంలోని అంతాయిగూడ గ్రామానికి చెందిన నల్ల రమేశ్, పద్మ దంపతులకు పవన్ (17), కార్తీక్ (15) ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏడేళ్ల క్రితమే అమ్మనాన్నలు మృతి చెందగా ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. అప్పటి నుంచి నానమ్మ యాదమ్మ ఇద్దరి పోషణ చూసుకుంటూ వచ్చింది. పవన్ గ్రామంలోనే పదవ తరగతి పూర్తి చేసి పనులు చేసుకుంటున్నాడు. కార్తీక్ ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్నాడు. అన్నీ తానై ఇన్ని రోజులు చూసుకున్న నానమ్మ గురువారం మృతి చెందడంతో ఇద్దరూ అనాథలుగా మారారు. ఆమె అంత్యక్రియలకు గ్రామస్తులు ఆర్థిక సాయం అందించారు. ఇద్దరు పిల్లలన్నీ ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

టిప్పర్ల యజమానులకు జరిమానా

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో సిద్ధి వినాయక ఆలయ సమీపంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనదారులకు జరిమానా విధించినట్లు తహసీల్దార్ బాన్‌కిరణ్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి తెలిపారు. రెండు టిప్పర్ల యజమానులకు రూ.5వేలు చొప్పున రూ.10వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు జరిపినా, తరలించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మల్లన్న పట్నం వారానికి ఏర్పాట్లు

- పరిశీలించిన ఆలయ చైర్మన్, ఈవో
- ఆదివారం ఘనంగా నిర్వహణ
- భారీగా హాజరుకానున్న భక్తులు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, నిర్వాహకులు, పోలీసులు



భక్తుల క్యూలైన్ల కోసం ఏర్పాట్లు

కొమురవెల్లి(సిద్దిపేట): కోర్కెలు తీర్చే కోరమీసాల కొమురవెల్లి మల్లన్న జాతర ఈ నెల 21వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. మొదటి ఆదివారం భక్తులు ఎక్కువగా స్వామి వారి దర్శనానికి వస్తుండడంతో ఆ వారిన్ని పట్నం వారంగా పిలుస్తారు. పట్నం వారం సందర్భంగా లక్షకు పైగా భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకోనున్న నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. గురువారం ఏర్పాట్లను ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఆలయ ఏఈవో అంజయ్య, చేర్యాల సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్ నాగరాజు, తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో, చైర్మన్ మాట్లాడుతూ.. నిర్మాణంలో క్యూ కాంప్లెక్స్ ముందు భాగంలో తాత్కాలిక క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నామని, స్నానపు గదులు, సులభ్ కాంప్లెక్స్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పార్కింగ్ ప్రదేశాల్లో మంచి నీటి వసతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి వారం వచ్చే భక్తులకు 60 వేలకు పైగా లడ్డూ ప్రసాదం సిద్ధం చేశామన్నారు. ఆదివారం అనంతరం సోమవారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు మాణిక్యం, పోచయ్య కుటుంబ సభ్యులు స్వామి పెద్దపట్నం వేసి అగ్నిగుండాలు నిర్వహించే ఆనవాయితీ ఉంది. దాని కోసం ఆలయ తోట బావి ప్రాంగణంలో ఏర్పాట్లను ఆలయ అధికారులు చేపడుతున్నారు. భక్తుల వీక్షించేందుకు గ్యాలరీలు ,పెద్ద పట్నం, అగ్నిగుండాలు వేసేందుకు మట్టిని చదును చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్ లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 14 మందికి జరిమానా విధించింది. ఇందులో ఒకరికి జరిమానాతోపాటు జైలు శిక్ష విధించినట్లు పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. మంగళవారం, బుధవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నామని, వీరిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 13 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు జరిమానా, మరో వ్యక్తికి రూ.10 వేల జరిమానాతోపాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పర్సు చోరీ.. ఏటీఎంతో నగదు డ్రా

సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగ అరెస్ట్



ఏటీఎంలో డబ్బు డ్రా చేస్తున్న ప్రవీణ్

రామాయంపేట(మెదక్): ప్రయాణికుడి పర్సు చోరీ చేయడమే కాకుండా అందులోని ఏటీఎంతో నగదు డ్రా చేసిన దొంగను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రంజిత్ కథనం మేరకు.. మెదక్‌కు చెందిన మాణిక్‌రావు బుధవారం బస్సులో సిద్దిపేట వెళ్తుండగా జేబులో నుంచి పర్సును గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. అందులో ఏటీఎం కార్డు ఉండడంతోపాటు పిన్ నంబర్ కూడా కార్డుపై రాసి ఉంది. దీంతో సదరు వ్యక్తి రామాయంపేటలో బస్సు దిగి పలు ఏటీఎంలలో రూ. 40 వేలు డ్రా చేశాడు. సీసీ ఫుటేజీలో నమోదైన చిత్రాల ఆధారంగా విచారణ జరిపిన పోలీసులు నిందితుడు సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్‌గా గుర్తించారు. ప్రవీణ్‌పై చేగుంట, దుబ్బాక, అల్వాల్ పోలీస్‌స్టేషన్లలో చోరీలకు సంబంధించి కేసులు నమోదు కాగా పలుమార్లు జైలు కెళ్లి వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రవీణ్‌ను గురువారం అరెస్ట్ చేసి, నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు యువకులు అదృశ్యమయ్యారు. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరులో ఒకరు, సదాశివపేటలో మరొకరు కనిపించకుండా పోయారు. అలాగే, మెదక్ జిల్లా రామాయంపేటలో ఓ యువకుడి ఆచూకీ దొరకడం లేదు.



మోహిద్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు సదాశివపేట ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన మహమ్మద్ మోహిద్(36) భార్యతో కలిసి కోహిర్ మండలంలోని చింతల్ ఘాట్ గ్రామానికి బంధువుల వద్దకు వెళ్లారు. భార్యను అక్కడే వదిలేసి సదాశివపేటలోని తన అన్న ఇంటికొచ్చాడు. తిరిగి ఈ నెల 16వ తేదీన చింతల్ ఘాట్ గ్రామానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. తర్వాత ఎవరికీ అందుబాటులోకి రాలేదు. అతడి కోసం చుట్టుపక్కల, బంధువుల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా తెలిస్తే 94409 39262 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



రాగి రమేశ్

రామాయంపేట(మెదక్): మండలంలోని సుతారిపల్లి గ్రామానికి చెందిన రాగి రమేశ్ (23)అదృశ్యమైనట్లు స్థానిక ఎస్ఐ రంజిత్ తెలిపారు. బుధవారం ఇంటినుంచి వెళ్లిపోయిన రమేశ్ తిరిగి రాకపోవడంతో గురువారం తండ్రి క్రిష్ణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగం కోసం వచ్చి..



శ్రీరామ్

పటాన్‌చెరు టౌన్: యువకుడు అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని సెంట్రల్ గ్రీన్ హోమ్స్‌కు చెందిన రమేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రమేశ్ బావమరిది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెదన మండలం పెనుమల్లి గ్రామానికి చెందిన గరికపాటి శ్రీరామ్ (27) ఉద్యోగం వెతుక్కునేందుకు రెండు రోజుల క్రితం రమేశ్ వద్దకు వచ్చాడు. వచ్చిన రోజే ఉద్యోగానికి సంబంధించిన కోర్సులో చేరాడు. ఈనెల 17వ తేదీ ఉదయం ఇంట్లో ఫోన్ వ్యాలెట్ వదిలి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. శ్రీరామ్ కోసం కుటుంబ సభ్యుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి



ఎడ్డీ కుమార్ (ఫైల్)

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతిచెందిన ఘటన గురువారం మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని పెద్దవాగులో చోటు చేసుకుంది.సదాశివపేట ఎస్ఐ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఎడ్డీ కుమార్(21) గ్రామ పంచాయతీలో కూలీగా పని చేస్తున్నాడు. చెరువులో చేపలు పడుతూ జీవనం సాగించేవాడు. ఐదు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతుకుతుండగా గ్రామ శివారులోని పెద్దవాగులో మృతదేహం తేలింది. గ్రామస్తులు గమనించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చేపలకు వెళ్లి ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తుగా నీటిలో మునిగి మృతి చెందాడని, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అంబేడ్కర్ నగర్‌కు చెందిన భ్యాగరి భూదవ్వ (55) పట్టణంలోని ఓ హోటల్‌లో కొన్నేళ్లు పని చేస్తోంది. మాదిరిగానే గురువారం పనికి వెళ్తుండగా అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. వృద్ధురాలి మృతికి కారణమైన బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.